# హజారే దీక్ష ముందుకు తెస్తున్న అంశాలు

వి.శ్రీనివాసరావు Sat, 9 Apr 2011

**తనకు రాజకీయపార్టీల మద్దతు అవసరం లేదని, ఏ రాజకీయ నాయకుడూ తన వేదికపైకి రాకూడదని అన్నా హజారే షరతు విధించారు. తద్వారా వామపక్షాలతో సహా అన్ని పార్టీలను ఏకం చేసే ప్రయత్నం జరిగింది. ఇది రాజకీయరహిత సిద్ధాంతం. రాజకీయపార్టీలన్నింటినీ ఒకేగాటన కట్టి రాజకీయ నాయకులంతా అవినీతిపరులే అన్న భావాన్ని ఈ సందర్భంగా వ్యాప్తి చేస్తున్నారు. ఇది ఉద్యమ విస్తృతిని గాక దాని సంకుచితతత్వాన్నే సూచిస్తుంది. రాజకీయాలతో నిమిత్తం లేకుండా అభివృద్ధి ఉండాలని ప్రపంచీకరణ వాదులు చేసే వాదన లాంటిదే ఇదీనూ. ఈ ఆలోచనలో భాగంగానే ప్రజలెన్నుకున్న పార్లమెంటు కాదు రాజకీయాలకు అతీతంగా ఉండే పౌరసంఘాలు (వీటినే గతంలో ఎన్‌జీవోలనేవారు) చట్టాలు చేయాలంటున్నారు.**

అవినీతికి వ్యతిరేకంగా ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షకు దేశవ్యాపితంగా పెద్దఎత్తున మద్దతు లభిస్తోంది. ఎస్‌యంఎస్‌లు, సోషల్‌నెట్‌వర్కింగుల ద్వారా ఈ ఉద్యమం మధ్యతరగతి మేధోజీవుల్లోకి వ్యాపిస్తోంది. అవినీతిపై ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తికి ఈ ఉద్యమం అద్దం పడుతోంది. అనూహ్యమైన ఈ పరిణామంతో పాలకులు కంగుతిన్నారు. దేశాన్ని అవినీతి వేరుపురుగులాగా పట్టిపీడిస్తోంది. అవినీతి ఒక చీడ. దాని పునాది వేరులోనే ఉంది. వేరు నరక్కుండా చీడనివారణకు ఎన్ని మందులేసినా మరల మరల వస్తూనే ఉంటుంది. ఈ వేర్లు జాతీయ సరిహద్దులకే పరిమితం కాలేదు. అది అంతర్జాతీయకరణ చెందింది. ఇటీవల వెలుగులోకి వచ్చిన 2జి కుంభకోణం మొదలుకొని ఐపియల్, కామన్‌వెల్త్ గేమ్స్ వరకు, ఇరవై ఏండ్ల నుండి రావణ కాష్టంలాగా తగలబడుతున్న బోఫోర్స్ నుండి యూనియన్ కార్బయిడ్ వరకు అన్నిటి మూలాలూ విదేశీ సంస్థలతో ముడిపడి ఉన్నవే. ఈ అంతర్జాతీయ దొంగల ముఠానే నేడు రాజ్యం ఏలుతోంది. హజారే సరిగ్గానే విమర్శించినట్లు లోక్‌పాల్‌పై కేంద్ర ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీలోని పెద్ద మనుషుల్లో కొంతమంది కుత్తుకల వరకు అవినీతిలో కూరుకుపోయినవారే.

దేశాన్ని కుదిపేసిన 2జి కుంభకోణంలో అవినీతేమీ జరగలేదని బుకాయిస్తున్న కపిల్‌సిబాల్, ఐపియల్‌కు నాయకత్వం వహిస్తున్న శరద్‌పవార్ లాంటి వారు ఇందులో సభ్యులంటే అవినీతి వ్యతిరేక బిల్లుకు ఏ గతి పడుతుందో సులభంగానే ఊహించవచ్చు. ఇదే శరద్‌పవార్ గతంలో బియ్యం, చక్కెర ఎగుమతి కుంభకోణంలో కూడా ఆరోపణలనెదుర్కొన్నారు. అందువల్లనే లోక్‌పాల్ బిల్లు కాదు జన్‌లోక్‌పాల్ బిల్లు కావాలని, దాని రూపకల్పనలో పౌరసంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని అన్నా హజారే దీక్ష చేస్తున్నారు. అంబుడ్స్‌మాన్‌గా వ్యవహరించే లోక్‌పాల్ శిక్ష విధించే హక్కుతో సహా సర్వాధికారాలు కలిగిన సర్వసత్తాక సంస్థగా ఉండాలని ఆయన కోరుతున్నారు.

హజారే దీక్ష అవినీతి సమస్యను జాతీయ అజెండాలోకి తెచ్చింది. ఈ వ్యవస్థలో అవినీతిని పూర్తిగా నిర్మూలించలేకపోయినా కనీసం అదుపులో ఉంచాలన్నా కట్టుదిట్టమైన చట్టాలు అవసరం. దీనిపై ఇప్పటివరకు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వమూ సిద్ధం కాలేదు. 1966లోనే మొరార్జీదేశాయి నాయకత్వంలోని పరిపాలనా సంస్కరణల కమిటీ లోక్‌పాల్ కోసం సిఫార్సు చేసింది. 1969లో లోకసభ బిల్లును ఆమోదించినా రాజ్యసభలో పాసవ్వలేదు. అప్పటి నుండి మహిళాబిల్లు లాగానే పలుమార్లు ప్రవేశపెడుతున్నారే తప్ప ఆమోదింపజేయడానికి ఏ ప్రభుత్వమూ చిత్తశుద్ధితో కృషి చేయలేదు. ఈ బిల్లులు కూడా చాల లోపభూయిష్టంగా ఉన్నాయి. 2010లో దీనిపై దేశవ్యాపితంగా చర్చ ఆరంభమైన పూర్వరంగంలో అనేక మంది ప్రముఖులు "అవినీతి వ్యతిరేక భారతదేశం" అనేపేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. అందులో అన్నా హజారేతోపాటు స్వామి అగ్నివేష్, బాబా రాందేవ్, శ్రీశ్రీరవిశంకర్, కిరణ్‌బేడీ, మేధాపాట్కర్ వగైరాలున్నారు. సినిమా రంగానికి చెందిన అమీర్‌ఖాన్, శేఖర్‌కమ్ముల కూడా ఉన్నారు. న్యాయకోవిదులు శశిభూషణ్, శాంతిభూషణ్, కిరణ్‌బేడీ, కర్నాటక లోకాయుక్త సంతోష్‌హెగ్డే వంటి వారు కలసి ఒక నమూనా బిల్లును తయారు చేశారు. ప్రభుత్వానికి దాన్ని అందజేశారు. దానిపై ప్రభుత్వం స్పందించకపోవడంతో ఇప్పుడీ ఆందోళన చేపట్టారు. దీక్ష సందర్భంగా హజారే చేస్తున్న ప్రకటనలు, ఉపన్యాసాలు కొన్ని అంశాలను చర్చనీయాంశం చేశాయి. వాటిని పరిశీలించడం అవసరం.

తనకు రాజకీయపార్టీల మద్దతు అవసరం లేదని, ఏ రాజకీయ నాయకుడూ తన వేదికపైకి రాకూడదని ఆయన షరతు విధించారు. తద్వారా వామపక్షాలతో సహా అన్ని పార్టీలను ఏకం చేసే ప్రయత్నం జరిగింది. ఇది రాజకీయరహిత సిద్ధాంతం. రాజకీయపార్టీలన్నింటినీ ఒకేగాటన కట్టి రాజకీయ నాయకులంతా అవినీతిపరులే అన్న భావాన్ని ఈ సందర్భంగా వ్యాప్తి చేస్తున్నారు. ఇది ఉద్యమ విస్తృతిని గాక దాని సంకుచితతత్వాన్నే సూచిస్తుంది. రాజకీయాలతో నిమిత్తం లేకుండా అభివృద్ధి ఉండాలని ప్రపంచీకరణ వాదులు చేసే వాదన లాంటిదే ఇదీనూ. ఈ ఆలోచనలో భాగంగానే ప్రజలెన్నుకున్న పార్లమెంటు కాదు రాజకీయాలకు అతీతంగా ఉండే పౌరసంఘాలు (వీటినే గతంలో ఎన్‌జీవోలనేవారు) చట్టాలు చేయాలంటున్నారు. ఇది ఒక రకంగా చట్టాలను ఔట్ సోర్సింగ్ చేయడం లాంటిదే. ప్రజలకు బాధ్యత వహించే పార్టీలు తప్పు చేస్తే, అవినీతికి పాల్పడితే వాటిని శిక్షించే అవకాశం, హక్కు ప్రజలకుంది. అందుకు ప్రజలను సన్నద్ధం చేయాలి. కాని దానికి బదులుగా ఎన్‌జీవోలు మాత్రమే ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తాయని చెప్పడంలో అర్థం లేదు. ఎన్‌జీవోలు ఎవరికి బాధ్యత వహిస్తాయి? ప్రజలకా? లేక తమకు నిధులు సమకూర్చే సంస్థలకా? ఈ సందర్భంగా హజారే, వారి మద్దతుదారులు కొన్ని అంశాలను సానుకూలంగా పరిశీలించాలి.

**ఒకటి:** గత ముప్పయి నాలుగేండ్లుగా అధికారంలో ఉన్న బెంగాల్, ప్రస్తుతం కేరళలో అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు రాజకీయ అవినీతికి అతీతంగా ఉన్నాయి. బెంగాల్ ముఖ్యమంత్రికి కనీసం బ్యాంకు అకౌంటు కూడా లేదంటే ఆశ్చర్యం వేయదా? ఆయన తనకొచ్చే యావత్ జీతభత్యాలను పార్టీకి అప్పగించి పార్టీ నుండి అందరు కార్యకర్తల మాదిరిగానే అలవెన్సు తీసుకుంటున్నారు. అలాంటి రాజకీయ నాయకులను స్వాగతించరా? కేరళ ముఖ్యమంత్రిని అవినీతి వ్యతిరేక పోరాటయోధునిగా ప్రజలు కీర్తిస్తున్నారు. ఆయన్ను కూడా అందరిలాగే అదే గాటన ఎందుకు కడుతున్నారు. అవినీతిపై పోరాడే చిత్తశుద్ధి కలిగిన కార్యకర్తలెవరైనా సరే బెంగాల్, కేరళలలో వామపక్షాలను ఎన్నుకోమని చెప్పాలి. కాని హజారే ఉద్యమంలో భాగస్వామిగా ఉన్న మేధాపాట్కర్ లాంటి ఎన్‌జీవో నాయకులు వామపక్ష ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రయత్నం చేస్తున్నారే ఎందుకోసం? ప్రత్యామ్నాయంగా

అధికారంలోకి వచ్చే వారు పరిశుద్ధులనా? నీతివంతంగా ఉండే వామపక్షాలను గద్దె దించాలనుకునే వారు ఏ కోవకు వస్తారు?

**రెండో అంశం:** ఐదు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయి. తమిళనాడులో డబ్బు పాత్ర ఎలా ఉందో చూస్తున్నాం. బెంగాల్, కేరళలలో వామపక్షాలు అతి తక్కువగా ఖర్చు పెడుతున్నాయి. బడా నాయకులు హెలికాప్టర్లలో తిరుగుతున్న వైనాన్ని చూస్తున్నాం. తద్భిన్నంగా వామపక్ష నాయకులు, కార్యకర్తలు కాలినడకతో, జీపుల మీదా ప్రచారం చేస్తున్నారు. దీన్ని గుర్తించరా?

**మూడు:** ఈ సంస్థ మూలపురుషుల్లో ఒకరుగా ఉన్న బాబా రాందేవ్ తాను రాజకీయాల్లోకి వస్తానని, పార్టీ పెడతానని కూడా ప్రకటించారు. స్వామి అగ్నివేష్ కూడా రాజకీయ నాయకుడే. గత ఎన్నికల్లో శ్రీశ్రీరవిశంకర్ ఎవరికి సహకరించారో అందరికీ తెలుసు. ఈ దీక్ష దగ్గర పెట్టుకున్న బాడ్జీల మీద నినాదం "మన్మోహన్ మీకు నా ఓటు కావాలంటే జన లోక్‌పాల్ బిల్లు వెంటనే తీసుకురా" అన్నది. అంటే బిల్లు తెస్తే ఓటేస్తాం అనే కదా అర్థం. తీసుకురాకపోతే ఎవరికి ఓటేయమంటారు. ఇది రాజకీయ నినాదం కాదా? రాజకీయపార్టీల జోక్యం వద్దనే పేరుతో అవినీతికి వ్యతిరేకంగా పోరాడే యోధునిగా ఉన్న వామపక్షాలను ఒంటరి చేసి, వారి కృషి గుర్తింపుకు రాకుండా చేయాలన్న ఆలోచన ఏమైనా ఉందా అన్న సందేహాలు రాకమానవు.

**నాలుగు:** ఈ ఉద్యమానికి మీడియా పెద్ద ఎత్తున ప్రచారం ఇస్తోంది. మంచిదే. కనీసం ఈ రూపంలోనైనా అవినీతి వ్యతిరేక ఉద్యమానికి తోడ్పడుతున్నారు. కాని గత ఎన్నికల తర్వాత పెయిడ్ న్యూస్ పెద్ద ఎత్తున ప్రచారంలోకి వచ్చింది. దీనిపై కార్పోరేట్ మీడియా సంస్థలు కనీసం స్పందించలేదు. వార్తల్లో ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆఖరికి 2జిలో కొందరు జర్నలిస్టులు సైతం అనుమానాస్పద పాత్ర నిర్వహించారు. మంత్రుల నియామకంలో కార్పోరేట్ సంస్థలకనుకూలంగా లాబీయింగు చేశారు. ఈ ఉద్యమానికి మద్దతివ్వడం ద్వారా పాప ప్రక్షాళన చేసుకోదలచుకున్నారేమో!. వార్తల్ని డబ్బులకు

అమ్ముకోడాన్ని హజారే సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా? ప్రజా ఉద్యమాలను రాజకీయ రహితం చేయాలనుకోవడంలో మీడియా స్వార్ధం ఏమిటి?

**ఐదు:** పరిశుద్ధులుగా చెప్పుకుంటున్న అనేక పౌరసంఘాలు వాస్తవానికి వాణిజ్యపరంగా నడుస్తున్నాయి. ఇటీవల రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన మైక్రోఫైనాన్స్ సంస్థల భాగోతాన్ని మనం చూశాం. జనాన్ని నిండా ముంచిన ఈ సంస్థలనేకం పేరుకు ఎన్‌జీవోలే. వాటిపై హజారే గళం విప్పరా? అలాంటి వారిని కూడా పౌరసంఘాల పేరుతో చట్టాల రూపకల్పనలో భాగస్వాముల్ని చేస్తారా?

**ఆరు:** రాజకీయ, ఆర్థిక విధానాలకు అవినీతి అతీతంగా లేదు. ప్రభుత్వరంగ సంస్థల్ని తెగనమ్మడంలో ఎంత అవినీతి జరిగింది. భూ మాఫియాలు ఎక్కడ నుండి పుట్టుకొచ్చాయి? దానికి వ్యతిరేకంగా వామపక్షాలు, కార్మిక సంఘాలు గళమెత్తితే ఈ ఎన్‌జీవోలు మౌనం వహించాయి. ఢిల్లీ పురవీథుల్లో పెద్దర్యాలీ జరిగితే ఏం జరగనట్టే కార్పోరేట్ మీడియా ఆ వార్తల్నే బ్లాక్ చేసేసింది. అవినీతిపై వామపక్షాలు దేశవ్యాపితంగా నెలరోజుల క్యాంపెయిన్ నడిపితే పట్టించుకోలేదు. పైగా 2జి అవినీతిపై శీతాకాల సమావేశాలను నడవకుండా అడ్డుకున్నందుకు వామపక్షాలపై విరుచుకుపడ్డవారున్నారు. ఎందుకని? ఈ పోరాటం అవినీతికి మూలమైన ప్రైవేటీకరణను బలహీనపరుస్తుంది కాబట్టి. అంటే ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారీకరణ కొనసాగాలి. అవినీతి మాత్రం ఉండకూడదంటున్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడటాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదు. కాని ప్రపంచీకరణ విధానాల నుండి అవినీతిని వేరు చేసి చూడటంలోనే పొరపాటుంది. హాంగ్‌కాంగ్ అంబుడ్స్‌మాన్ రిపోర్టు ప్రకారం 65శాతం అవినీతి ప్రైవేటురంగంలోనే నడుస్తోంది. హజారే ఉద్యమానికి మద్దతునిస్తున్న ఒక సంస్థ ఏకంగా ప్రైవేటీకరణ ద్వారానే అవినీతిని నిర్మూలించొచ్చంటూ ప్రచారం ఆరరభించింది కూడా. నార్వే, స్వీడన్్ లాంటి స్కాండినేవియన్ దేశాల తరహాలో అంబుడ్స్‌మెన్ వ్యవస్థ ఉండాలని అంటున్నారు. కాని బోఫోర్స్ కుంభకోణానికి మూలం స్వీడన్‌లోనే ఉందని మరచిపోలేం. అవినీతి అతి తక్కువగా ఉందన్న స్విట్జర్‌లాండ్ నల్లడబ్బుకి నిలయంగా ఉందని మనకు

తెలుసు. ఇలాంటి దేశాల తరహాలోనే అంబుడ్స్‌మెన్ ఉండాలంటున్నారు. ఆ దేశాల్లో అవినీతి సమసిపోయిందని ప్రపంచబ్యాంకు, ప్రపంచ ఆర్థిక ఫోరం లాంటి సంస్థలు నెలకొల్పిన ''ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్'' కితాబునిస్తోంది. అంబుడ్స్‌మెన్ ఉన్న ఫిలిప్పీన్స్‌లో ఇప్పుడు దానిపైనే వివాదం నడుస్తోంది. గత ప్రభుత్వం నియమించిన అంబుడ్స్‌మెన్ తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా కక్షకట్టి వ్యవహరిస్తోందని ప్రస్తుత ప్రభుత్వం దానిపై ఇంపీచ్‌మెంట్ తీర్మానం పెట్టింది. డిప్యూటీ అంబుడ్స్‌మెన్‌పై ఒక అవినీతి వ్యతిరేక సంస్థ ఆరోపణలు గుప్పిస్తోంది. హాంకాంగ్‌లో ఈ వ్యవస్థ గవర్నర్‌కు బాధ్యత వహిస్తుంది. ఇలా వివిధ దేశాల అనుభవాలు వివిధ రకాలుగా ఉన్నాయి. దీన్నే సర్వరోగ నివారిణిగా చెప్పడంలో అర్థం లేదు. ఈ అనుభవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని కట్టుదిట్టమైన శాసనం తీసుకురావాలి.

ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించనున్న లోక్‌పాల్ బిల్లు కరిమింగిన వెలగపండు లాంటిది. దాన్ని మార్చి శక్తివంతమైన బిల్లుకు రూపకల్పన చేయడానికి పౌరసంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నదే దీక్షచేస్తున్న వారి ప్రధాన డిమాండు. అన్నా హజారే దానికి ఛైర్మన్‌గా ఉండాలని వారు కోరుతున్నారు.. ప్రశాంత్‌భూషణ్ లాంటి న్యాయనిపుణులను భాగస్వాముల్ని చేయాలనడంలో తప్పు లేదు. కాని పౌరసంఘాలకే దాన్ని పరిమితం చేయాలనడం సరైంది కాదు. సంప్రదింపుల్లో అందరినీ భాగస్వాముల్ని చేయాలి. అది కూడా రాజకీయ ప్రక్రియలో భాగంగానే జరగాలి తప్ప దానికి అతీతంగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కాదు.

దీక్ష చేస్తున్నవారి డిమాండు కన్నా బలపరుస్తున్న ప్రజల మనోగతం మరింత బలవత్తరంగా ఉంది. అవినీతిపై సమరానికే వారు దీక్షలకు మద్దతు ప్రకటిస్తున్నారు. ప్రజాగ్రహం కట్టుదాటక ముందే పటిష్టమైన, సమగ్రమైన లోక్‌పాల్ బిల్లును ప్రభుత్వం ఆమోదించాలి. ఇంకా నానుస్తుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు.

అయితే శాసనాలతోనే అంతా అయిపోతుందనుకుంటే అది భ్రమే అవుతుంది. అవినీతికి అతీతంగా ఉండే పార్టీలను, నాయకులను ఆదరించినప్పుడే అది అర్థవంతమవుతుంది. జన లోక్‌పాల్ బిల్లుకు అనుకూలంగా ఉండే పార్టీలకే ఓటేయాలని ఈ సంస్థ పిలుపునిచ్చింది. ఓటుకి బిల్లు ప్రాతిపదిక కాదు. ఏ పార్టీ అవినీతికి అతీతంగా ఉందో దాన్ని బలపర్చమని కోరాలి. అదే

ప్రజల మనోగతం. అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడేవారు దానికి అతీతంగా ఉన్న పార్టీలను గెలిపించమని విజ్ఞప్తి చేయాలి. కేరళ, బెంగాల్‌లో అందుకు ముందుకు రావాలి. వామపక్ష ఉద్యమాలను బలపరచుకుంటేనే అవినీతి వ్యతిరేకపోరాటం బలపడుతుంది. అవి బలహీనపడితే అవినీతి కూడా ప్రబలుతుంది. ఈ రెంటినీ విడదీసి చూడటం తప్పు. హజారే ఉద్యమంలో ఉన్న కొన్ని ప్రధాన బలహీనతలివే. ఎన్ని పరిమితులున్నా ఈ ఉద్యమాన్ని స్వాగతించాల్సిందే. అవినీతి వ్యతిరేకపోరాటాన్ని మహా ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాల్సిన ఆవశ్యకతను అన్నా హజారే దీక్ష ముందుకు తెచ్చింది. అందుకు ఆయన అభినందనీయులు.

## అవినీతిపై పోరాటాన్ని మోడీకరణ చేయొద్ద

ప్రభుత్వంతో అవగాహన కుదరడంతో అన్నా హజారే దీక్ష విరమించారు. దేశ వ్యాపితంగా ఆనందోత్సాహాలు వెల్లువెత్తినట్లుగా మీడియాలో వార్తలొస్తున్నాయి. ఇందులో మీడియా క్రియాశీలపాత్ర వహించింది. దీక్ష విరమించగానే "భారతదేశం జయించింది" అన్న బ్యానర్‌లతో వార్తలిచ్చాయి. నిన్న ప్రపంచకప్..నేడు హజారేదీక్ష..అన్న చందంగా అభివర్ణించాయి. ప్రపంచకప్‌ను శ్రీలంకమీద గెలుచుకున్నాం కాని దీక్ష ఎవరిపై విజయం? ఇందులో భారతదేశం విజేత అయితే ఓడిందెవరు? అవినీతి ఓడిపోయిందా? లేక ప్రభుత్వం ఓడిపోయిందా? అందరూ నీతిపరులే అయితే అవినీతి ఎక్కడుంది? ప్రాస కోసం వార్తలు, విశ్లేషణలు ఇస్తున్నారనుకున్నా ప్రజలకు వాస్తవం తెలియాలి కదా? ఈ ఉద్యమంలో అత్యంత విషాదకర వార్తలు కూడా ఉన్నాయి. ఎవరినైతే అవినీతిపరులుగా మీడియా ఎత్తి చూపిందో వారే నేడు ఈ ఉద్యమానికి మద్దతునీయడంలో అందరికన్నా ముందున్నారు. ఉదాహరణకు కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప సంబరాలు జరుపుకున్నారు. పలు భూ కుంభకోణాల్లో ఆరోపణలు నిగ్గు తేలినా ఆయనన్ను పదవిలో అట్టిపెట్టిన బిజేపీ అవినీతి వ్యతిరేకపోరాట యోధురాలిగా పోజులిస్తోంది. 2జి కుంభకోణానికి ఆదిమూర్తులు బిజేపీవాళ్లేనని ఇప్పుడు రికార్డులు చెపుతున్నాయి. అరుణ్‌శౌరీ మంత్రిగా ఉండగా ఈ చౌకబేరానికి తెర లేపారు. రాజా ఆ వారసత్వాన్ని అంది పుచ్చుకున్నాడంతే. దీక్షకు సోనియాగాంధీ సంఘీభావం తెలియచేస్తూ హజారేకు ఉత్తరం

రాశారు. కాంగ్రెసు, బిజేపీలు రెండూ ఉత్తమ పార్టీలే అయితే దేశంలోని సొమ్మంతా వారికి తెలియకుండానే ఎక్కడికి పోతున్నట్లు? ఐపియల్ కుంభకోణంలో పదవి నుండి తొలగించబడ్డ లలిత్ మోడీ క్రికెట్ అభిమానులంతా హజారే బొమ్మ, బ్యానర్లు పెట్టుకొని స్టేడియంలకు రావాల్సిందిగా పిలుపునిచ్చాడు. బడా పారిశ్రామిక సంస్థలు సిఐఐ, ఆసోచామ్, ఫిక్కీ ఈ ఉద్యమానికి భుజం కాశాయి. ఆహ్! ఎంత బాగుంది. ఈ విజయంలో వీరందరూ భాగస్వాములే అయితే పరాజితులు ప్రజలేనన్న మాట. అవినీతిపరులు, నీతిపరులు ఇద్దరూ ఒకే వైపు ఉండగలరా?

దీక్ష విరమణానంతరం ఆదివారం హజారే మీడియానుద్దేశించి మాట్లాడుతూ నరేంద్రమోడీని ఆకాశానికెత్తారు. తద్వారా తనంతట తానుగా ఉద్యమ పరిధిని కుదించుకున్నారు. రాజకీయాలకతీతంగా అవినీతి వ్యతిరేకోద్యమం అన్న ఆయన మాటల చిత్తశుద్ధిని ఇది తేటతెల్లం చేసింది. మోడీని ఆయన ఉత్తమ ముఖ్యమంత్రిగా కొనియాడారు. చట్టం వచ్చి ఎనిమిదేండ్లయినా ఇంతవరకు గుజరాత్‌లో లోకాయుక్తను నియమించలేదు. పైగా ఆ చట్టం పరిధిలోకి ముఖ్యమంత్రి రాడు. గుజరాత్ ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎంత పెద్దఎత్తున అవినీతిసాగుతుందో స్వయానా మోడీ సోదరుడే మీడియాకు చెప్పారు. ఇక ముస్లిం ఊచకోతలకు మోడీ ట్రేడ్‌మార్క్‌గా మారిపోయిన విషయాన్ని గురించి చెప్పుకోవాల్సిన అవసరమే లేదు. అదే మరో వైపు బెంగాల్ లోకాయుక్త పరిధిలోకి ముఖ్యమంత్రిని తీసుకొచ్చి చరిత్ర సృష్టించింది. దీన్ని బట్టే హజారే అసలు ఉద్దేశాలేమిటో మనకు బోధపడుతుంది. ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్న విలేకరుల ప్రశ్నకు ప్రజలు ఓట్లను అమ్ముకుంటున్నారని నిందించారు. ఆయనకు ప్రజలపై విశ్వాసం లేదని దీన్ని బట్టి అర్థమవుతోంది. అంతేకాదు ఆయనపై ప్రజలకున్న విశ్వాసాన్ని కూడా వమ్ము చేసే మాటలివి. అంతెందుకు. బిల్లు రూపకల్పనలో పాల్గొనే వ్యక్తుల(హజారే టీం) ఆస్తిపాస్తుల వివరాలను బహిరంగంగా ప్రకటిస్తారా అని విలేకరులు అడగ్గా నీళ్లు నమిలారే తప్ప ఎందుకని అక్కడికక్కడే ముందుకు రాలేకపోయారు? జన లోక్‌పాల్ బిల్లు తయారు చేయడంలో కర్నాటక లోకాయుక్త ప్రధానపాత్ర

పోషించారు. కాని ఆయన తన స్వంత రాష్ట్రంలో ముఖ్యమంత్రిపై తీవ్ర ఆరోపణలొస్తే కనీసం విచారించలేకపోయారు.

అన్నా హజారేకు వాటర్ షెడ్ల నిర్మాతగా పేరుంది. 1995-2004 మధ్యలో మన రాష్ట్రంలో వాటర్‌షెడ్లు పెద్దఎత్తున చేపట్టారు. హజారే మన రాష్ట్రానికి వచ్చి పలు సభల్లో పాల్గొని దాన్ని నీటి విప్లవంగా కొనియాడిపోయారు. కానీ ఏం జరిగింది? వేల కోట్ల రూపాయలు గంగపాలయ్యాయి. మహబూబ్‌నగర్, ప్రకాశం, ఆదిలాబాద్, విజయనగరం లాంటి జిల్లాలు ఇప్పటికీ కరువు కోరల్లో నలుగుతూనే వున్నాయి. వాటర్‌షెడ్ల పేరుతో ప్రాజెక్టులను విస్మరించారు. నాడు ప్రపంచ బ్యాంకు చెప్పింది ఇదే. కానీ ఉపరితల జలాలను భూగర్భ జలాలుగా మార్చడం ద్వారా నీటిపై హక్కు ప్రైవేటు కంపెనీలకు పోయింది. కోకోకోలా, పెప్సీ లాంటి కంపెనీలు ఈరోజు నీళ్ళను పెద్ద వ్యాపారంగా మార్చివేయగలిగినాయి. ఇప్పుడు వాటర్‌షెడ్లు, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ గురించి ఎవరూ నోరెత్తడం లేదు. అవినీతి నిర్మూలనా కార్యక్రమం కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ బ్యాంకు కనుసన్నలలోనే సాగుతున్నది. ఇది సత్ఫలితాల నివ్వకపోయినా ప్రజల కోపాగ్నిని చల్లార్చగలదని వారికి తెలుసు.
మీడియా జన లోక్‌పాల్ బిల్లుకోసం ఎందుకంత ఆరాటపడుతున్నది? నిజంగా అవినీతిని అరికట్టవచ్చునని నమ్ముతున్నారా? 90శాతం అరికడతామని హజారే చెపుతున్నారు. అలా అయితే ఇప్పటివరకు ఉన్న చట్టాలు ఎందుకు విఫలమయ్యాయి? నేరస్థులను అరికట్టే చట్టాలు కఠినంగా ఉన్నా నేరం ఎందుకు పెరుగుతూనే ఉంది. అవినీతికి రాజమార్గాలెన్ని వున్నాయో వారికీ తెలుసు. ఈ కొత్త వ్యవస్థపై దృష్టి మళ్ళించడానికి ప్రధాన కారణం ఒకటుంది. గత కొంతకాలంగా ఈ వ్యవస్థకు పట్టుకొమ్మలుగా వుండే వివిధ యంత్రాంగాల నిజ స్వరూపం బట్టబయలవుతోంది. రాజకీయ పార్టీలు, నాయకులు, ఉద్యోగస్తులను పక్కన పెట్టినా ఆఖరికి న్యాయ వ్యవస్థ, మీడియాపై కూడా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. అవినీతి వ్యతిరేక సంస్థలే అవినీతిపరుల పాలయ్యాయి. ఉదాహరణకు తాజా సివిసిగా థామస్ నియామకం. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవాలంటే ప్రజలకు విశ్వాసం కల్పించే మరో కొత్త వ్యవస్థ

కావాలి. అదే లోక్‌పాల్. దాన్ని అవినీతిని నిర్మూలించే రుద్ర కాళికగా చూపెట్టి ప్రజల్లో ఈ వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టించేందుకు జరుగుతున్న ప్రయత్నం ఇది. కొంతకాలమైనా ప్రజలలో రగులుతున్న అసంతృప్తిని, ఆగ్రహావేశాలను అదుపు చేయవచ్చు. ఈ తాత్విక ఆలోచనల నుంచే ప్రభుత్వం ఎక్కువ సమయం తీసుకోకుండానే హజారే డిమాండ్లను అంగీకరించి సంయుక్త కమిటీని నియమించింది. తద్వారా తాను కూడా అవినీతి నిర్మూలనకు కట్టుబడి వున్నానని నిరూపించుకునే ప్రయత్నం చేసింది.

అవినీతికి కారణాలపై మీడియాలో జరుగుతున్న చర్చల్ని పరిశీలిస్తే ఏనుగు ఏడుగురు గుడ్డివాళ్ల కథ గుర్తుకొస్తుంది. వ్యక్తుల అత్యాశను కారణంగా కొందరు చెపితే, ఎన్నికల వ్యవస్థను కారణంగా మరికొందరు భావించారు. బ్యూరోక్రసీని కొందరు నిందిస్తే, అధికార కేంద్రీకరణను మరికొందరు ఎత్తిచూపారు. రాజకీయనాయకులను, పార్టీలను కొందరు ఘాటుగా విమర్శించారు. కఠినమైన చట్టాలు లేనందునే అవినీతి ప్రబలుతోందని మరికొందరు వాదిస్తున్నారు. ఇలా ఎవరికి తోచిన పద్ధతిలో వారు విశ్లేషణ చేస్తున్నారు. ఎవరి దృక్కోణం ప్రకారం వారి వాదన సరైందనే అనుకుంటున్నారు. వాదనలన్నీ పాక్షికమైనవే. ఇవన్నీ విడివిడిగా వాస్తవాలైనప్పటికీ సమగ్రమైన విశ్లేషణ మాత్రం కాదు. ఉదాహరణకి బ్యూరోక్రసీ వల్లనే అవినీతి పెరిగిందీ అనుకుంటే గత 20 ఏళ్లలో నూతన ఆర్థిక విధానాల తరువాత బ్యూరోక్రసీ ప్రభావం ప్రభుత్వ యంత్రాంగంపై చాలా తగ్గింది. ఆ లెక్క ప్రకారం అవినీతి తగ్గాలి. కానీ ఈ కాలంలో ఇంకా పెరిగింది. శేషన్ ఎన్నికల సంస్కరణలతో అంతా బాగవుతుందనుకున్నారు. కాని ఏమైంది? డబ్బు ప్రభావం తగ్గకపోగా పెరిగింది. డబ్బు పెట్టని వామపక్షాల వంటి పార్టీలకు ప్రచారం చేసుకునే అవకాశం లేకుండా కుదించేశాయీ నిబంధనలు. అలాగే వ్యక్తుల అత్యాశ అని అంటున్నారు. ఆశ అనేది ప్రతి ఒక్కరికీ ఉంటుంది. చదువుకునే వారికి, వ్యవసాయం చేసేవారికి, ఉద్యోగం చేసేవారికి, కూలి వారికి, పారిశ్రామిక వేత్తకు, రాజకీయ నాయకులకు. ఇలా ఆశ లేనటువంటి వారు లేరు. కానీ ఆశ వున్నా కూలివారు, కార్మికులు వీళ్ళెవరూ కూడా ధనికులు కాలేకపోతున్నారు. చదువుకున్న వాళ్ళకు ఉద్యోగాలు దొరకడం లేదు. కాబట్టి ఆశవల్లే అవినీతి

పెరిగిందంటే ప్రతి ఒక్కరూ అవినీతి పరులే కావాలి ఈ దేశంలో. ఆశ వున్నప్పటికీ కూడా దాన్ని ఆచరణలో పెట్టాలంటే అవకాశాలు కూడా ఉండాలి. అలాంటి అవకాశాలు ఈ వ్యవస్థలో ఎక్కడున్నాయనే విషయం మనం పరిశీలించాలి. అన్నిటికి మూలం కోరికలలో వుందని బుద్ధుడు అన్నాడు. ఆ లెక్క ప్రకారం కోరికలను చంపుకోవాలి. అది సాధ్యమవుతుందా. లేదా మనుషుల మనసులు మార్చడానికి దైవప్రార్థనలు చేయాలి. ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇప్పించాలి. మనసును అదుపులో పెట్టుకోవడానికి యోగా చేయాలి. ఈ పనులు చేస్తున్నవారు అవినీతికి అతీతంగా ఉన్నారా? అలా కూడా లేరు. పైగా అవినీతికి ఎక్కువ పాల్పడుతున్నవారే ఇటువంటి పనులు చేస్తున్నారని మన కంటికి కనిపిస్తున్నది. కాబట్టి ఆశ వ్యక్తుల యొక్క లక్షణం కాదు.

దీనికి మూలం మరోచోట ఉంది. నిజానికి ఆశ అనేది పెట్టుబడి లక్షణం. ఈ వ్యవస్థలో తన పెట్టుబడిని పదింతలు చేయడానికి అది అర్రులు చాస్తుంది. లాభం తీసుకురాకుంటే అది ఆ రోజు నిద్రపోనివ్వదు. అది నిద్రపోదు. టీవీ స్క్రీన్ మీద క్షణక్షణం మారే షేర్ మార్కెట్ గ్రాఫ్ మనుషుల్ని ఉరకలు పెట్టిస్తుంది. పెట్టుబడి చట్టాలను లెక్కచేయదు. సమాజం పట్ల దానికి దయాదాక్షిణ్యాలు వుండవు. లాభం కోసం ఏ పనికైనా తెగబడుతుంది. హత్యలు, దోపిడీలు చేస్తుంది, జైళ్ళు బద్దలు కొడుతుంది. అలాంటి పెట్టుబడికి స్వేచ్ఛను ఇచ్చి దేశం మీదికి వదిలింది ఎవరు? సంస్కరణలకు ముందు పులిని బోనులో పెట్టి, రోజు కొన్ని జంతువులను ప్రభుత్వమే బలి ఇచ్చేది. దాని ఆకలి తీర్చలేకపోయింది. బలిసిపోయినకొద్దీ ఆకలి పెరుగుతోంది. నువ్వు నా ఆకలిని తీర్చలేవు. నీకెందుకు శ్రమ. నన్ను ఒదిలేసెరు..నా మానాన నేను బతుకుతాను. అని పులి చెప్పడంతో బోనులోంచి ఒదిలేసింది ప్రభుత్వం. దానికే సంస్కరణ అని ముద్దుపేరు పెట్టింది. ఇప్పుడది స్వైర విహారం చేస్తోంది. శనివారం హిందుస్తాన్ టైమ్స్‌లో ఇచ్చిన మార్కెట్ సర్వే ప్రకారం 40% అవినీతి ప్రైవేటు కంపెనీలు ప్రభుత్వ పెద్దలను ఆడించడానికే వినియోగిస్తున్నారు. 20% అవినీతి కంపెనీల మధ్య సాగుతోంది. కస్టమర్లను ఆకర్షించడానికి మరో 20% అవినీతి ఖర్చవుతోంది. ఉద్యోగులను అదుపుచేయడానికి, పన్నును ఎగవేయడానికి అవినీతిని ఎరగా వేస్తున్నారు.

దేశం పేరులో చేరి పీడిస్తున్న ఫైనాన్స్ పెట్టుబడిని అదుపు చేయకుండా అవినీతిని అరికడతాం అంటే అది జనాన్ని మోసం చేయడమే అవుతుంది. లేకపోతే లోక్‌పాల్ వంటి చట్టాల ద్వారా మహా అయితే కిందిస్థాయి అవినీతిని కొంతవరకు తగ్గించవచ్చు. లేదంటే పాలకవర్గాల మధ్య ఉండే వైరుధ్యాన్ని పరిష్కరించుకోవడానికి ఉపయోగపడవచ్చు. లోక్‌పాల్ వచ్చాక పై స్థాయిలో కొత్త మార్గాలను కనిపెడతారు. ఉదాహరణకు కోటి రూపాయలు క్యాష్‌గా ఇచ్చే బదులు, ఒక కంపెనీ లాటరీలో డ్రా తీసుకొని 4 కోట్ల ఖరీదు కలిగిన ఒక కారును బహుమతిగా అందించవచ్చు. ఒక కంపెనీ పెట్టించి దాని షేర్లను అధిక ధరకు కొని లాభం చేకూర్చవచ్చు. విదేశాల్లో చదివే నాయకుల బిడ్డల ఖర్చులన్నీ విదేశీ కంపెనీ భరించవచ్చు. దాన్ని ఎవరు, ఎలా అరికడతారు? రాజ్యాధికారంతో సహా సర్వాధికారాలు అనుభవిస్తున్న ఫైనాన్స్ పెట్టుబడి లీలల నుండి ఎవరైనా తప్పించుకోగలరా?

బిల్లు ఆమోదానికి వారు పడుతున్న ఆరాటం చూస్తుంటే లోక్‌పాల్ చట్టాన్ని పటిష్టవంతంగా రూపొందించడం కన్నా తాము తయారు చేసిన బిల్లును ఆమోదింపచేసుకోవాలన్న తపనే ఎక్కువగా కనిపిస్తున్నది. ఈ కమిటీకి వెలుపల అవినీతి వ్యతిరేక పోరాటంపై ఆసక్తి కలిగిన వ్యక్తులు, శక్తులు, సంస్థలు చాల ఉన్నాయి. ఆ విషయాన్ని వారు ముందు గుర్తించాలి. ఉదాహరణకు ప్రఖ్యాతి గాంచిన న్యాయమూర్తి జస్టిస్ వి ఆర్ కృష్ణయ్యర్ వున్నారు. ప్రముఖ జర్నలిస్టు, మెగసేసె అవార్డు గ్రహీత పి.సాయినాథ్ వున్నారు. అవినీతి వ్యతిరేకపోరాటంలో వీరు అలుపెరగని యోధులు. బోఫోర్స్ మొదలుకొని తాజా వీకీలీక్స్ వరకు హిందూ పత్రిక సాగించిన పోరాటం మనకు తెలుసు. అలాగే తెహల్కా మీడియా ద్వారా అనేక అవినీతి కేసులు వెలుగులోకి వచ్చాయి. 2జిలో రాడియా టేపుల్ని బయటపెట్టింది ఓపెన్ అనే మ్యాగజైన్. అందరినీ కమిటీలో పెట్టుకోలేకపోయినా కనీసం బిల్లు ముసాయిదా తయారైనాక దాన్ని ప్రజల కోసం బహిరంగపరచాలి. అందరి అభిప్రాయాలూ తీసుకోవాలి. కానీ వీరి తొందరపాటు చూస్తుంటే ఏకబిగిన పార్లమెంటులో పెట్టేసి వెంటనే ఆమోదించాలన్నట్లు వుంది. హజారే పెట్టిన ఆగస్టు 15 గడువు బిల్లుపై విశాల మద్దతును కూడగట్టేందుకు, విస్తృతంగా చర్చ జరిగేందుకు తోడ్పడదు.

బిల్లును ఆమోదించాల్సింది పార్లమెంటు. ఆ పార్లమెంటు సభ్యులు ప్రజలెన్నుకొన్న ప్రతినిధులు. వారిలో అధికార పక్షమే కాదు, ప్రతిపక్షం కూడా వుంది. ప్రతిపక్షంలో బిజెపి లాంటి అభివృద్ధి నిరోధక పార్టీయే కాదు, వామపక్షాల్లాంటి అభ్యుదయ శక్తులు వున్నాయి. అవినీతిపరులే కాదు, నీతి నిబద్ధత కలిగిన వ్యక్తులూ వున్నారు. వారు దానిని అధ్యయనం చేసి క్లాజుల వారీగా తమ అభిప్రాయం చెప్పాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం బిల్లు పెట్టగానే చేతులెత్తేసి, బల్లలు చరిచి ఆమోదించే పద్ధతి మంచిది కాదని సెలెక్ట్ కమిటీ, స్టాండింగ్ కమిటీ, కన్సల్టేటీవ్ కమిటీ విభాగాలనేర్పాటు చేసుకున్నారు. ఇలాంటి బిల్లుల్ని సహజంగా పార్లమెంటులో ప్రవేశపెట్టాక సెలెక్ట్ కమిటీకి పంపిస్తారు. అక్కడ నిపుణుల సహాయంతో లోతుగా పరిశీలించి స్టాండింగ్ కమిటీ తన సిఫార్సులు చేస్తుంది. కానీ హజారే కోరుతున్న పద్ధతి ప్రకారం దానికి అవకాశం వుండదు. ఇది ప్రజాస్వామ్యాన్ని పరిహసించడం కాదా? జన లోక్‌పాల్ బిల్లును తయారు చేయడానికి హజారే గారి టీమ్ దాదాపు 8 నెలల సమయం తీసుకుంది. 3 ముసాయిదాలు మార్చారు. ఆ మాత్రం సమయం ప్రజలకు పార్లమెంట్‌కు ఇవ్వాల్సిన అవసరం లేదా? అన్నది ఇక్కడ ప్రశ్న. ఇప్పటివరకు బిల్లు పెట్టకుండా ఆలస్యం చేయడం ఎంత తప్పో విస్తృత చర్చ లేకుండా హడావుడిగా ఆమోదించం కూడా అంతే తప్పవుతుంది. వ్యవస్థీకృతమైన అవినీతిని సంఘటితంగా ఢకోీనాలి. దానికి ప్రజల మద్దతు చాలా కీలకం. అది పౌర సంఘాల ద్వారా జరిగే పని మాత్రమే కాదు, చైతన్యవంతమైన, నిబద్ధత కలిగిన ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలను కూడా విశ్వాసంలోకి తీసుకొని భాగస్వాములను చేయాలి. అప్పుడే అది కొంతవరకు విజయవంతమవుతుంది. లేకుంటే లోక్‌పాల్ మరల గుంటనక్కల పాలవుతుంది.